


"అమ్మా సాహితీ! తొందరగా విడిదికి రావాలి. నువ్వూ, మీ ఆయనా! అక్కడ వరపూజ, స్నాతకం ఇంకా చాలా తతంగముంది, పదండి" హడావిడి చేస్తూ తీసుకెళ్లారు పినమామగారు.

విడిదిలో...

కొయ్యపాదుకలు తొడుక్కుని, గొడుగేసుకుని, జరీ అంచు ధోవతి కట్టుకుని విసినకర్ర చేత పుచ్చుకుని, దృష్టిదోషం సోకకుండా బుగ్గన చుక్కా, కంటికి అంటీ అంటకుండా వల్లని కాటుకరేఖా, కల్యాణ చిహ్నమైన నిలువు బొట్టు పెట్టుకుని కాశీయాత్రకు బయలుదేరి బయటకు వచ్చిన పెళ్ళికొడుకుని మొట్టమొదటసారి చూచిన సాహితి అప్రతిభురాలైంది!.

అదే మనోహర విగ్రహం... అదే కమనీయమంద హాసం! "భగవంతుడా! ఇది నిజం కాకుండా చెయ్యరాదా?" అని ఘోషించింది ఆమె అంతరంగం. ఎందుకు నిజం కాదు? కళ్లెదుట ప్రత్యక్షంగా కనిపిస్తోంటే..."పాణీ! నిన్ను ఈ రూపంలో నా వాడిగా ఊహించుకుని మురిసి కలలు కన్నానే! చివరకు నిన్నిలాగా ఇటువంటి పరిస్థితిలోనా చూడాల్సి వచ్చింది? ఇందుకా నేను బ్రతికి వున్నది? అవశురాలైపోయిందామె. ఆమె స్థితిని, కట్టుకున్న భర్త పట్టించుకోకపోయినా ప్రక్కనే నిల్చున్న ముత్తైదువ "ఏమిటమ్మా సాహితీ కన్యాదాన కష్టమంతా ముందేప్పుడే వుంటే యిప్పుడే అలా అయి పోతున్నావు" అంటూ నవ్వింది. ఆ ఏం లేదులెండి. కాస్త కళ్ళు తిరుగుతూంటేనూ.." అంటూ తేల్చేయబోయింది సాహితి.

> కోరుకున్న వ్యక్తి జీవిత భాగస్వామిగా లభిస్తే, అప్పుడు కలిగే ఆనందం యింతా అంతా కాదు. కానీ ఆ అదృష్టం అందరికీ లభిస్తుందా? ఏవేవో కారణాల వల్ల ఆ అదృష్టం చేజారి, పరిస్థితులతో రాజీపడి, 'మనసు' లేకపోయినా, మరో వ్యక్తితో నవజీవనం కొనసాగించవలసి వచ్చినప్పుడు—ఆ పరిస్థితి ఎలా వుంటుంది?

"ఔను మరి! ఆడబిడ్డ పెళ్లి నిశ్చయమైనప్పటినుంచీ ఒక్కలా శ్రమ పడితివి పాపం. ఇంకా పీటల మీద చాలా తతంగముంది. కాస్త కాఫీ తాగుదువుగాని రా." అంటూ ఆప్యాయంగా లోనికి నడిపించుకెళ్లిందా పెద్దావిడ.

విడిది నుండి తిరిగి వచ్చాక మళ్లీ పెళ్లి కూతురి ప్రక్కన కూర్చో బెట్టారు పురోహితుడు. సాహితి కళ్ళల్లో కాశీయాత్ర దృశ్యమే కదులుతోందింకా...

"నాకా కన్య దొరక లేదు వివాహమాడటానికి. కనుక నేను కాశీ వెళ్లి ఇంకా చదువుకుంటాను" అని పాణి చేత పురోహితుడు అనిపిస్తే, సాహితి భర్త శేఖర్ వెళ్లి అతని గడ్డం క్రింద బెల్లం ముక్క మెల్లిగా కొట్టి "పెళ్లి కూతురు దొరక లేదనే చింత మీకక్కర్లేదు బావగారూ! నా చెల్లెలుంది. వరించండి" అన్నాడు.

సాహితి మనసు శతకోటి కంఠాలతో ఎలుగెత్తి అరిచింది." పాణికి పెళ్లికూతురు దొరక్క కాదు. ప్రాణాధికంగా ప్రేమించి హృదయంలో ప్రతిష్ఠించుకున్న పెళ్లికూతుర్ని చేసుకోనివ్వ లేదు విధి"—అని!

"అక్కా! ఏమిటి అదోలా వున్నావు? కన్యావరణాలు చదువుతున్నారు పురోహితులు, వింటున్నావా.." భుజాలు మృదువుగా కుదుపుతూ అన్నది పావని.

ఉలిక్కిపడింది సాహితి. మంగళమంత్రోచ్ఛారణలతో కళ్యాణ మంటపం ప్రతిధ్వనిస్తోంది.

పెళ్లికూతురి తాత పేరు, ముత్తాత పేరు, తండ్రి పేరు దగ్గరనుంచి చెవుతోంటే తన తండ్రి, తాతల పేర్లు మనసులో మెదిలినై సాహితికి. "సాక్షాల్లక్ష్మీ స్వరూపిణీ, హైమవతీనామ్నీం, కన్యాం" అంటోంటే "అయ్యో! సాహితీ నామ్నీం కన్యాం అనాల్సిన చోట ఇలా అంటూంటే వినవలసిన ఖర్మ కలిగించావే భగవంతుడా..." అని కాస్సేపూ "అయ్యయ్యో! పెళ్లైపోయిన నాకీ ఊహలేమిటి? ఆ మాత్రం మనోనిగ్రహం లేకపోయాక బతకటం దేనికి?" అని కాస్సేపూ తల్లడిల్లిపోయిందామె.

"అమ్మా...ఇదుగో వింటున్నారా.." అని హెచ్చరించాడు పురోహితుడు. "ఆచమనం చెయ్యమంటే వినిపించుకోవేం. ఏమిటంత ఆలోచనలు" కసురుకున్నాడు భర్త. కన్నీళ్లు బలవంతాన ఆపుకుని మనసును తతంగంపై నిలిపే ప్రయత్నం చెయ్యసాగింది సాహితి.

ఓ ప్రక్కగా ఎవరికో తన సంగతి చెబుతోన్న పినమామగారి మాటలు వినవచ్చాయి. "ఆ కన్యాదానం చేస్తోన్నది మా అన్నయ్య కోడలేనండీ న్యాయానా — ఆయన పోవడంతో కొడుకు కోడలు కన్యాదానం చేస్తున్నారు."

"పిల్ల లక్ష్మీదేవిలా వుంది" మెచ్చుకోలుగా అన్నాడాయన. "అందుకే కదండీ కానీ కట్నం లేకుండా చేసుకున్నాం మా శేఖర్‌కి—" అంటున్నారు పినమామగారు.

అది విన్న సాహితికి ఏడవలేక నవ్వొచ్చింది. "హా రూపంలో లక్ష్మీదేవి నైతేనేం? లక్ష్మీకటాక్షం లేకపోయాకా! అదే వుంటే పాణి పక్కనే..." అనుకున్నది దిగులుగా.

అక్కడనుంచి పెళ్లి మంటపంలోకి తీసుకు వెళ్ళాడు పురోహితుడు. ఇద్దరు తెర పట్టుకున్నారు. కాసేపయాక పెళ్లికూతుర్ని తీసుకొచ్చి కూర్చో బెట్టారు. జీలకర్రా బెల్లం నెత్తిన ఉంచటం అయిపోయింది సుముహూర్తానికి.

"కన్యాం, కనకసంపన్నాం.." అంటూ సాలంకృత సదక్షిణాకంగా కన్యాదానం చేయిస్తూన్నాడు పురోహితుడు.

"ఉత్తమ సంతానం కోసం నేను ఈమెను పత్నిగా స్వీకరిస్తున్నాను. ధర్మం విషయంలోగాని, అర్థం విషయంలోగాని, కామం విషయంలోగాని నేను ఈమెను మోసగించను." అని అర్థం వచ్చే మంత్రాలు వరుని చేత పలికిస్తున్నాడు. అబద్ధం చెబుతోన్నప్పుడు లాగా వరుని కంఠం వణకటం సాహితికి స్పష్టంగా తెలుస్తోంది.

కొబ్బరి బొండాలతో, తాంబూలంతో కలిపి సాహితీ, శేఖర్ హైమవతిని పాణి చేతుల్లో పెడుతూ..కన్యధార పోస్తుంటే ఇంక ఆపుకోలేకపోయింది సాహితీ. చప్పున రుమాలు కళ్ళకడ్డం పెట్టుకుంది, అక్షింతల వర్షాన్ని కళ్ళల్లో పడకుండా ఆపుతోన్నట్లు.

తన పెళ్ళయి ఆరు నెలలు దాటినా ఇంతగా మనసులో నిలిచి పోవటం ఏమిటి? ఈ ఉద్వృతభారావేశం ఏమిటి? అతని పెళ్లి ఎవరితోనో, ఎక్కడో అయిపోయి వుంటే యింత ఆవేదనా, ఇంత చిత్రవధా వుండకపోనేమో? తను ఈ పెళ్లి పందిరిలో ప్రేక్షకురాలిగానే కాదు..అతనికి అత్తగారిగా లేకపోతే అక్కగానా? మానవమాత్రులు ఎవరైనా భరించ గలరా ఇంత శిక్ష? అనుకుంటూ అగ్గగ్గలాడి పక్కకి తిరిగి హైమవతి వంక వరకాయించి చూచింది. "అందం అంటే అర్రులు చాచి, సంగీతసాహిత్యాలంటే ప్రాణం పెడతాడు పాణి. అలాంటి వాడికా ఈ హైమ భార్య!' నిట్టూర్చింది.

• • •



—ఓగేటి ఇందిరాదేవి

ఇంతలో మధ్యనున్న తెర తీసివేశారు కాబోలు పాణి స్పష్టంగా కనబడ్డాడు. అప్పుడు అతడి కళ్ళలో కదిలిన భావాలను రాయడానికి ఏ రచయితకూ శక్తి చాలదేమో—.

"అయ్యో, సాహితీ! నువ్విక్కడ అత్తగారి స్థానంలో"... గుండె గుబగుబలాడుతుండగా ఆమె ప్రక్కన చూచాడు పాణి. 'హమ్మయ్య' అన్నట్లు నిట్టూర్చాడు. అంత బాధలోను అదొక పెద్ద రిలీఫ్‌గా అనిపించిందతనికి. ఈ పెళ్ళికూతురికి సవతితల్లి కాదుకదా సాహితి.. ఏ ముసలి వాణ్ణి చేసుకోవలసిన దురదృష్టం కలిగిందోనని ఒక్క క్షణం వణికిపోయిన పాణికి శేఖర్ని చూడగానే పెద్ద భారం దించినట్లయింది. తరువాత అతనికి గుర్తొచ్చింది—పెళ్ళికూతురికి తండ్రి లేడని — అన్నా వదినా కన్యాదానం చేస్తున్నారని, అనుకోవటం.

మళ్ళీ బాధ తిరగబడింది పాణిలో. 'నువ్వు నాకు బావగారి భార్యవా సాహితీ! అంటే అక్కయ్యవే, చెల్లెలివే అన్న మాట! నన్నెందుకింత క్షోభ పెడుతున్నావు చెప్పు! నేను తప్పు చేసి వుండవచ్చు—కానీ యింత దారుణశిక్ష భరించలేను సాహితీ—నిన్ను దూరం చేసుకుని ఇంకా బతుకుతున్నానంటే ఎంత బండ రాయి నా గుండె? నా స్వప్నసుందరి, నా సమస్తకవిత్వ ఆధారరేఖ, నా ఆనంద గీతి సాహితి నాకు దూరమైపోయింది. ఆమె కాదు, చేజేతులా నేనే దూరం చేసుకున్నాను. తనలో ఎన్ని ఆశలు సృష్టించి మొదలంటా త్రుంచేశాను!?!' అని గగ్గోలు పెడుతున్నాయి.

శేఖర్ ఎంత అదృష్టవంతుడు! కానీ కట్నం వద్దనీ, కన్యారత్నం మాత్రమే చాలనీ సాహితిని చేపట్ట గలిగాడు. జీవితంలో ఆనందపు పంటలు పండించుకోగల్గుతున్నాడు—అనుకుంటూ యాంత్రికంగా పెళ్ళికూతురి వంక చూచాడు — ప్చ్. అటువంటి సాహితిని ఇల్లాలిగా ఊహించుకుని యిప్పుడీ హైమవతితో ఎలా కాపురం చెయ్యటం?" అనిపిస్తోంటే 'అదేమన్న మాట—పాతిక వేలకి కొనుక్కుంది నన్ను పాపం ఆ పిల్లకు అమ్ముడు పోయి అలా అనుకోవడం పాపం కదూ! భగవంతుడా... మధ్యతరగతి కుటుంబంలో మగ పిల్లవాడిగా పుట్టించకు. పుట్టించినా కట్నం తిరస్కరించే పరిస్థితుల్ని ధైర్యాన్ని కలిగించు" అనుకున్నాడు.

అప్పట్లో తన ప్రేమ విషయం తెలిసి వరుగెత్తుకొచ్చి తండ్రి చేసిన శాసనం గుర్తొచ్చింది పాణికి.

" చాల్లే వరించక వరించక టీచరుకూతుర్ని వరించావన్నమాట—వాళ్ళు కట్నం యిచ్చుకోలేరట, లాంఛనాలు జరపలేరట—అయినా నువ్వేమిటోయ్ పెద్ద ఆదర్శ పురుషుడిలా కట్నకానుకలొద్దంటావు? ఇదిగో—కట్నంతీసుకోవటం మగవాడి జన్మహక్కు. అందం కొరుక్కు తింటావుట్రా—ముష్టిఅందం—నీ చదువు కోసం చేసిన అప్పంతా ఎలా తీర్చమంటావు నన్ను? ఇప్పుడు రిటైరైపోయాక నన్ను నడి సముద్రంలో వదిలేసి వెళ్ళిపోతావుట్రా నాయనా! నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకుని చదివించాను! ఇలా ఏరు దాటి తెప్ప తగలేస్తావనుకోలేదు బాబూ! నీ ప్రేమ గోల తెలిసి నీ తల్లి గుండెలు పగిలేలా ఏడుస్తోంది—ఇన్నేళ్ళు ఒక మంచి చీర లేకుండా కడుపు నిండా తిండి తినకుండా నీ చదువు కోసం డబ్బు కూడబెట్టిన కన్న తల్లికి చచ్చే రోజులైనా, మనశ్శాంతి కలిగించరా బాబూ!' అని నయానా బ్రతిమాలాడు.

"ఒరే ఆశయాలు అవీ కూడు పెట్టవురా—చేతనైతే నీ ముగ్గురు చెల్లెళ్ళకీ కట్నం లేకుండా పెళ్ళి చేసి అప్పుడు చూపించుకో నీ ఆశయాలు—అయినా విను ముందే చెబుతున్నా కట్నం లేకుండా ఎవరైనా మన ఆడపిల్లల్ని చేసుకోవడానికి ముందుకొస్తున్నారా? రారురా—ఛస్తే రారు—నీలాంటి వాజమ్మ లెవరూ వుండరు. తనకు మాలిన ధర్మం పనికిరాదోయ్. నువ్వు ఆ సాహితిని మర్చిపోతావా లేక నీ చేతుల్తోనే మా కింత విషం పెడతావో తేల్చుకో" అని భయానా బెదిరించాడు.

ఆయనతో ఎన్ని రకాల తర్కించినా లాభం లేకపోయింది. ఇదే విషయం ఏ కథల్లోనో చదివితే "ఏడవలేక పోయాడు. వీడెక్కడి హీరో! తండ్రిని ఒప్పించడం చాతకాని దద్దమ్మ! అంత ప్రేమించిన అమ్మాయిని అవలీలగా వదిలేశాడా? ఛ ఛ అదే నేనైతేనా?' అనేవాడే—కానీ నిజజీవితంలో అదే పరిస్థితి ఎదురైతే ఏం చెయ్యగలిగాడు! అమ్మానాన్నల మాట మీర లేక, వారి తర్కానికి ఎదురు చెప్పజాలక, సలక్షణంగా కట్నం గుంజుతూ, ప్రియాతిప్రియతమ సాహితిని వదులుకొని నిండు నూరేళ్ళ బ్రతుకు మట్టిపాలు చేసుకున్నాడు. ఇలా దుర్భరంగా అనుక్షణం నరకంగా వేదనపాలై అలమటించాల్సిందేనా పాపిష్టి డబ్బు కోసం? ఓ..దాని ముద్దు పేరు కట్నం కాబోలు. ఈ పెళ్ళికూతురి పేరు... ఆ హైమవతి కదూ—పాపం, దాంపత్య జీవితాన్ని గురించి ఎన్ని సువర్ణ స్వప్నాలు అల్లుకుందో? ఈ అమాయకురాలికి తన వరుడి హృదయం ఇంకో స్త్రీకి ఏ నాడో అంకితమైనదనీ, పైగా ఆస్త్రీ కేవలం తన వదినే అని తెలియదు గదా! జీవచ్ఛవం లాంటి తను ఆమెకు ప్రాప్తమైనాడు. ఏ పాపం ఎరగని గులాబి వంటి పెళ్ళికూతురు, ఇరవై అయిదు వేలు విదిల్చి భర్తను కొనుక్కుని కూడా పూర్తిగా స్వంతం చేసుకొనే అవకాశం లేక అసంతృప్తితో బాధపడాలి. హైమవతి పట్ల సానుభూతి కలుగుతోంది కానీ వేరే స్పందన కలగటం లేదే! సాహితిని మరచి ఈమెను ఏలుకోవటం ఈ జన్మకు సాధ్యపడుతుందా?

"బావగారు! ఏ లోకాల్లో తేలిపోతున్నారు!" నవ్వుతూ ఎగతాళి చేస్తున్నారు శేఖర్, అతని స్నేహితులు. ఉలిక్కిపడి చుట్టూ చూసి తన పరధ్యానాన్ని అందరూ అపార్థం చేసుకున్నట్లు గ్రహించాడు.

పురోహితుడు మంగళసూత్రం అందించాడు. "గట్టిగా వేసెయ్ నాయనా మూడుముళ్ళూ" ఛలోక్తిగా హెచ్చరించాడు. పాణి లేచి నిలబడ్డాడు. భావావేశానికి లోనైన అతడి కళ్ళు మబ్బులు కమ్మిన ఆకాశంలా భారంగా, వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. చెయ్యకూడని పని చెయ్యబోతు వెనకంజ వేసే వ్యక్తిలా తడబడుతున్నాడు. కాళ్ళు, చేతులు స్పష్టంగా వణుకుతున్నాయి.

పెళ్ళికూతురి జడ ఎత్తి పట్టుకున్న సాహితి వంక అనాలోచితంగా చూశాడు"క్షమించు ప్రియతమా! నేను చేస్తున్న ఈ దురాగతంలో త్రికరణ శుద్ధి లేదు. కేవలం యిది మనసు లేని మనువు. నీ మనోమందిరంలో నా పట్ల అనురాగజ్యోతి ఆరకుండా వెలగనీ. నన్ను క్షమించు" అన్నట్లు దీనంగా వున్నాయి అతని చూపులు.

ధగధగలాడే బంగారు మంగళసూత్రాలు, మిసమిసలాడే పసుపు పచ్చని దారాల వంకా ఓ సారి చూచి—వణికే చేతులతో, అమాయకురాలైన ఆ నిర్భాగ్యకన్య హైమవతి మెడలో నిర్దయగా మూడు ముళ్ళ ఉరిత్రాడు బిగించి వేసాడు పాణి.

హర్షిస్తున్నట్టు కల్యాణ మంటపమంతా మారుమ్రోగాయి మంగళవాద్యాలు.

మధ్య తరగతి మనుషులైన పాపానికి, రసహీనమైన ప్రేమరహితమైన జీవితాలకు ఆయత్తంకాసాగారు, ఇద్దరు ప్రేమైక జీవులు! □